క్లుప్తంగా

డ్రైవర్‌పై చర్య తీసుకోవాలి

నెల్లికుదురు: మండల పరిధిలోని వేంనూర్ గ్రామ శివారులో జరిగిన ప్రమాద ఘటనలో గ్రానైట్ లారీ డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ఆందోళన వద్దకు టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడగా ఆందోళన విరమించారు.

పనుల్లో వేగం పెంచాలి

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందా రమేష్, ఎంపీడీఓ బాలరాజు, క్లస్టర్‌స్థాయి అధికారులు ఎంపీఓ పద్మ, అనిల్, హౌసింగ్ ఏఈ అనిల్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య

గార్ల: భార్యకు ఆరోగ్యం క్షీణించడం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం తిర్లాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన మాలోత్ శ్రీను(46) భార్య జ్యోతికి కొంతకాలం నుంచి ఆరోగ్యం సరిగా లేక వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి అన్న శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా వెల్లడించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

మరిపెడ రూరల్: మండలంలోని గుర్రప్పతండాకు చెందిన రైతు హళావత్ రామన్నకు చెందిన పశువులు మంగళవారం తండా శివారులోకి వెళ్లాయి. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తున్న క్రమంలో ఓ ఎద్దు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని రైతు బోరున విలపించాడు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

నెల్లికుదురు: ఇటీవల వేంనూర్ గ్రామ శివారులో ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులను ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి

నెల్లికుదురు: గ్రామగ్రామాన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఇన్‌చార్జ్ బుక్కపురం మహేష్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో శేషం కిరణ్, సంతోష్, యాదగిరి, హుస్సేన్, రమేష్, ప్రతాప్, బాబు, మధు, రవి, రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిపై చర్య తీసుకోవాలి

నెల్లికుదురు: జిల్లా కేంద్రంలోని సాయి పల్లవి ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జెరిపోతుల వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిపై చర్య తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. రోగులను మోసం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

దంతాలపల్లి/బయ్యారం/గంగారం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నేడు క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈఓలు మంగళవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడ పాఠశాలల్లో సీట్ల భర్తీ కోసం 4వ తరగతి బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని హరిహర గార్డెన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు ఆధ్వర్యంలో టీడీపీ మండల కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. ఈసందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన ఏశబోయిన ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బోడకుంట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా నరసయ్య ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా ముత్తయ్య, లక్ష్మణ్, లచ్చిరాం, కార్యదర్శులుగా సారయ్య, దశాల్, కోశాధికారిగా స్వరూపలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ఎస్సారెస్పీ కాల్వలు

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో సరైన సమయాలలో వర్షాలు కురువక ఏర్పడుతున్న కరువు కోరల నుంచి రైతులను కాపాడేందుకు చెరువులను నింపుతూ, సాగు భూములకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చు చేసి ఎస్సారెస్పీ కాల్వలు తవ్వారు. కానీ నేడు ఆ కాల్వలు కబ్జా కోరల్లో చిక్కుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో చెరువులను, కుంటలను నింపేందుకు తవ్విన ఎస్సారెస్పీ ఉప కాల్వలను పూడ్చి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. పూడ్చిన కాల్వల ఆనవాళ్లు కూడా లేకుండా చేస్తున్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామంలో ఓ చెరువు, రెండు కుంటలు నింపుతూ.. రైతులకు సాగు నీరు అందించేందుకు 7ఎల్ ఉప కాల్వకు, 1ఆర్ఎల్ ఉపకాల్వను తవ్వారు. అది పొలాలనుంచి చెరువు వరకు సుమారు రెండు కిలోమీటర్లు వరకు ఉంటుంది. ప్రభుత్వం కాల్వను ఎడమ, కుడి వైపు సుమారు 22ఫీట్ల గట్టుతో తవ్విన పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. ప్రభుత్వం చెరువులకు ఇంత వరకు కాల్వల ద్వారా నీళ్లు అందించలేదు. నీళ్లు అందించకపోవడంతో ఇదే అదునుగా తీసుకున్న రైతులు క్రమంగా కాల్వను కబ్జా చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేసి కాల్వలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.


చంద్రుతండా సమీపంలో పూడ్చిన ఉపకాల్వ

చర్యలు తీసుకుంటాం..



ఎస్సారెస్పీ కాల్వలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తాం. ఎంత మంది రైతులు కబ్జాలు చేశారో వారి వద్ద హద్దులు ఏర్పాటు చేస్తాం. కాబ్జా చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
– వినయ్, ఎస్సారెస్పీ డీఈ

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

పెద్దవంగర: చారిత్రక ప్రాంతమైన పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు సీఆర్ఆర్ నిధులతో రూ.1.12కోట్లు, పోచారం నుంచి వడ్డెకొత్తపల్లి గ్రామానికి రూ. 3.95కోట్ల నిధులతో ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి అనేది కేవలం మాటల్లో కాకుండా పనుల్లో స్పష్టంగా కనిపించాల్సిన అవసరం ఉందన్నారు. చేపట్టిన పనులు నాణ్యతతో వేగంగా పూర్తి కావాలన్నదే మా ఆకాంక్ష అని, సంబంధిత అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు జాటోతు నెహ్రు నాయక్, గోపాల్ నాయక్,రాజు యాదవ్, తోటకూర శ్రీనివాస్, సీతారాం నాయక్, హరికృష్ణ, యాకన్న, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

గంగారం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రమాదేవి, ఎంపీడీఓ అప్పారావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బాలిక విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలితాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురవి: ప్రభుత్వ బడిలో పిల్లలు చేరాలని సీరోలు ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్ అన్నారు. మంగళవారం సీరోలు మండలం ఉప్పరిగూడెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సమ్మిళిత విద్యా దినోత్సవం నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేషనల్ టీచర్ జి.సురేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం అరుణశ్రీ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

గూడూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సీడీపీఓ సీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని భూపతిపేట, గుండెంగ, ఇప్పల్‌తండా, గుండాల్‌తండా, మట్టెవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంజుల, రాజేశ్వరి, కళావతి, విజయకుమారి పాల్గొన్నారు.

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని రెడ్యానాయక్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌లో మంగళవారం విచారణ అధికారి జహీరుద్దీన్‌ను వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ బాలికల్లో చదువుతున్న వారికి రక్షణ కరువైందని, గత ఫిబ్రవరి నెలలలో గుర్తు తెలియని వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు. ఈవిషయంపై జిల్లా డీడీ, ఏటూరునాగారం, భద్రచలం ఐటీడీఓ పీఓలకు ఫిర్యాదు చేసిన హాస్టల్ వార్డెన్ అనితపై చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు పేదలకు ఇవ్వాలని దీక్ష

తొర్రూరు: గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎండీ యాకుబ్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలు, తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న, పూర్తి కాకుండా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను నిరుపేద ప్రజలకు వెంటనే ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్పందించి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు, జమ్ముల శ్రీను, డొనక దర్గయ్య, మార్క సాంబయ్య, శోభ, శ్రీలత, అరుణ, వరలక్ష్మి, అమీనా, సరోజ, తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 6 గంటలకు యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం యోగా కరపత్రాన్ని వాకర్ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు సదానందం, సుధాకర్ రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్, వెంకటరెడ్డి, అశోక్ బాబు, మైపాల్ రెడ్డి, వెంకటరెడ్డి, పరంధామయ్య, రాజు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి

తొర్రూరు: కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు పైండ్ల రాజేష్, పుష్పశెట్టి సంతోష్, విజయ్‌కుమార్, యాకన్న, భరత్, రవి, శేఖర్, రాజ్‌కుమార్, రాజు, జగదీష్ పాల్గొన్నారు.

చిన్నగూడూరు: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ మండల అధ్యక్షుడు ఘనగాని వేణు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, నామ రాజు, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: సీజనల్ వ్యాధులను దరి చేరనీయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి సూచించారు. మంగళవారం మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి గ్రామంలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, సూపర్‌వైజర్స్ సుదర్శన్, ఆచార్యులు, సిబ్బంది తరణి, ఏఎన్‌ఎంలు చంద్రకళ, విజయ, ఆశలు గణిత, మాధవి, జ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి

పెద్దవంగర: ప్రజల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ రవికుమార్, పల్లె దవాఖాన డాక్టర్ రాజ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం బూబా, ఫార్మసిస్ట్ కిషన్, యోగా ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఆశ పుష్ప పాల్గొన్నారు.

దంతాలపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు వాణి తెలిపారు. మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు.

పేదలకు ఇళ్లు నిర్మించడమే లక్ష్యం

గూడూరు: అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని పొనుగోడు, రాములుతండా, మధనాపురం గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూమి పూజ నిర్వహించి, మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని మహర్షి స్కూల్ పక్కన గల మున్సిపల్ పిల్లల పార్కుకు మెయిన్ రోడ్డు నుంచి పార్క్ వరకు పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు టీపీ జేఏసీ బాధ్యులు మైస శ్రీనివాసులు, పొక్కుల సదానందం, సోమ విష్ణువర్ధన్, షేక్ జానీ మంగళవారం వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మరిపెడ: అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని 7వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గుండగాని వెంకన్నగౌడ్, బోరగంగయ్య, బయ్య లింగయ్య, యాకూబ్, రామగిరి సత్యనారాయణ, గుంటి రవి, సయ్యద్ సర్వర్, సాయి, అక్బర్, బొల్లం రవి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బీమానాయక్, ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ రజిని, కంచనపల్లి ఎల్లమ్మ, చాట్ల రామచంద్రు, కంచనపల్లి వెంకన్న పాల్గొన్నారు.


గూడూరు: ఇంటి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పల్లె ప్రకృతి వనంపై గొడ్డలి వేటు..

- చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలింపు

మరిపెడ రూరల్: ప్రతి గ్రామానికి ఆహ్లాదకరమైన, అందమైన వాతావరణం అందించాలన్న ఉద్దేశంతో రకరకాల పూల మొక్కలతో ప్రతీ గ్రామంలో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. చూపరులను ఆకర్షింప చేసే ఆ ప్రకృతి వనాలు అధికారులు నిర్లక్ష్యంతో గొడ్డలివేటకు బలైపోతున్నాయి. కొందరు వ్యక్తులు వనంలోని ఏపుగా పెరిగిన చెట్లను నరికి ట్రాక్టర్ ద్వారా తరలించుకుని పోతున్నారు. మరిపెడ మండలం దంట్లకుంటతండా గ్రామ పంచాయతీ శివారులో ప్రధాన రహదారి వెంట అర ఎకరం స్థలంలో గత ప్రభుత్వ హయాంలో పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అందుకు వేల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను నాటించి వాటిని సంరక్షించారు. కానీ రక్షణ లేక చెట్లు గొడ్డలి వేటుకు బలైతున్నాయి. అధికారులు స్పందించి ప్రల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నరికిన చెట్ల స్థానంలో మొక్కలను పునరుద్ధరించాలని గ్రామస్తులతోపాటు వనప్రేమికులు కోరుతున్నారు.


ప్రకృతి వనంలో నరికిన చెట్లు

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

డోర్నకల్: డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జనగాం నరేష్ తనిఖీ చేశారు. ఇటీవల డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో అసిస్టెంట్ లైన్‌మన్ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో అప్రమత్తమైన విద్యుత్‌శాఖ అధికారులు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ విజయ్, ఏడీఈ ఐలయ్య, ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

కురవి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కాంపల్లి గ్రామంలోని రైతువేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

డోర్నకల్: పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడ కొడవండ్ల విజయ్ కోరారు. బస్‌పాస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గాంధీ సెంటర్‌లో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలోగూడూరు సాయి, పవన్, పెంటిక సాయి, సంతోష్, అమూల్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

డోర్నకల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి కోరారు. మండలంలోని తొడేళ్లగూడెం, ముల్కలపల్లి గ్రామాల్లో మగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

వసతులను మెరుగుపర్చాలి

మరిపెడ: సంక్షేమ హాస్టళ్ల వసతులను మెరుగుపర్చాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. మరిపెడలో కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, ఎల్లయ్య, దర్గయ్య, వెంకట్రాములు, మహేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం, అమ్మాపురం గ్రామాల సీపీఐ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్ మంగళవారం తెలిపారు. కంఠాయపాలెం గ్రామ కార్యదర్శిగా మందపురి శ్యాంసుందర్, సహాయ కార్యదర్శిగా వలసాని రమేష్, అమ్మాపురం గ్రామ కార్యదర్శిగా బూరుగు యాదగిరి, సహాయ కార్యదర్శులుగా నక్కిరెడ్డి సమ్మిరెడ్డి, యాకయ్య ఎన్నికయ్యారు.

ఎంపీడీఓకు వినతి

నర్సింహులపేట: ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులతో కలిసి ఫీల్డ్ అసిసెంట్లు మంగళవారం ఎంపీడీఓ యాకయ్యకు వినతి పత్రం అందచేశారు. మృతుడి భార్య తూడి కల్యాణి, రాములు పాల్గొన్నారు.

విత్తనషాపుల తనిఖీ

కురవి: మండల కేంద్రంతోపాటు సూదనపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం విత్తన, ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్లు విత్తనాలు కొన్న రైతులకు విధిగా బిల్లులు, రశీదులు ఇవ్వాలని, ఎమ్మార్పీకి అమ్మిన వివరాలను ఫార్మర్ సేల్ రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. ఫామ్–డీలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



తొర్రూరు రూరల్: ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి చేయూతనివ్వాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య కోరారు. మంగళవారం మండలంలోని వెలికట్ట, మాటేడు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు మహిళ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాలోతు సునీత, రాజేందర్ దంపతుల సహకారంతో టై, బెల్ట్, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

చెక్కుల పంపిణీ

కురవి: సీరోలు మండల కేంద్రంలో 19మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను మంగళవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొరకని యువకుడి ఆచూకీ

డోర్నకల్: మండలంలోని రావిగూడెం సమీపంలో అదృశ్యమైన యువకుడి ఆజూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్‌కు చెందిన ఉల్లి రంజిత్‌కుమార్ ఎలియాస్ రాకేష్ మూడు రోజుల క్రితం రావిగూడెం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి శనివారం అదృశ్యం కాగా డోర్నకల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం కూడా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అన్నదాతలకు ‘భరోసా’

గార్ల: సీఎం రేవంత్‌రెడ్డి ఖరీఫ్‌లో రైతుల పెట్టుబడి సాయం కోసం రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేసి అన్నదాతలకు అండగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని ఉత్తరతండా జీపీ పరిధిలో గల గుర్రాల గుట్టతండా, నేతాజీతండా మధ్యలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం తెలిపారు. జరిగిన సంఘటనపై మృతుడు గుగులోతు రాజు తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు.

దివ్యాంగులకు సేవలు

మహబూబాబాద్ రూరల్: దివ్యాంగులు ఎవరైనా ఉన్నట్లయితే గ్వనెల్ల దివ్యాంగుల సేవా కేంద్రంలో సంప్రదించి సేవలు పొందాలని వరంగల్ క్యాథలిక్ పీఠ పాలనాధికారి విజయ్‌పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా చర్చి క్యాంపస్ పరిధిలో గ్వనెల్ల దివ్యాంగుల సేవా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండాలో మంగళవారం ఆంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

దంతాలపల్లి: మండలకేంద్రంలో నేడు నిర్వహించే ఉచిత గుండె వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆస్పత్రి కోఆర్డినేటర్ ఊర్మిళ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం

తొర్రూరు రూరల్: మండలంలోని టీక్యాతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేతావత్ వెంకన్న కుటుంబానికి మహిళ కాంగ్రెస్ నాయకురాలు మాలోతు సునీత, రాజేందర్ దంపతులు రూ.10వేల నగదును అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్, సురేష్‌నాయక్, జాటోతు మొగిలి, రాంలాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


మరిపెడ రూరల్: మండలంలోని జెండాల్‌తండాకు చెందిన ధారావత్ కిషన్(48) కుటుంబంలో గొడవలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతోపాటు బయటి వ్యక్తులు కలిసి కిషన్‌ను చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టినట్లు తెలుస్తుంది. దీంతో అస్వస్థతకు గురైన అతడిని ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

గూడూరు: నిషేధిత నాటుసారా తయారీ, విక్రయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్ నాగేశ్వర్ రావు, గూడూరు ఎక్సైజ్ సీఐ ఎస్. భిక్షపతి హెచ్చరించారు. మండలంలోని అప్పరాజ్‌పల్లి, దుబ్బగూడెం గ్రామాల్లో మంగళవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 37లీటర్ల నాటుసారాతోపాటు 7సెల్‌ఫోన్‌లు, 13మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసులు నమోదు చేసి, గూడూరు తహసీల్దార్ నాగభవాని ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్సైలు రజిత, కిరీటి, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కిలోల ఎండు గంజాయి స్వాధీనం

గూడూరు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి మూడు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం మల్క నగిరి జిల్లా మాలాభరమ్ మండలం అనంతపల్లికి చెందిన నాక డేవిడ్ రాజ్, అదే మండలం నలగుంటి గ్రామానికి చెందిన మధుగైన్, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్‌తండాకు చెందిన భూక్య సురేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీ చేపడుతుండగా.. వారు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో ద్విచక్ర వాహనం తనిఖీ చేయగా సుమారు రూ.1,50,000 విలువ చేసే ఎండు గంజాయి లభించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.


అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై